క్లుప్తంగా

పంచాయతీరాజ్ వ్యవస్థతో మెరుగైన పాలన



కార్యక్రమంలో మాట్లాడుతున్న భాగ్యలక్ష్మి

మల్కాపురం : పాలన వికేంద్రీకరణకు, ప్రజలను భాగస్వామ్యం చేయడానికి పంచాయతీరాజ్ వ్యవస్థ ఎంతగానో ఉపయోగపడుతుందని జిల్లా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఈపీఎస్ భాగ్యలక్ష్మి అన్నారు. రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో 'పంచాయతీరాజ్ వ్యవస్థ–తీరుతెన్నులు' అనే అంశంపై శుక్రవారం సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి అతిథిగా హాజరైన ఆమె పంచాయితీరాజ్ వ్యవస్థపై అవగాహన కలిగిస్తూ అనేక అంశాలు విద్యార్థినులకు వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రోగ్రాం అధికారి వై.అనసూయాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం పోస్టర్ ఆవిష్కరణ

మల్కాపురం : ఈ నెల 26న 60వ వార్డు పరిధి గుల్లలపాలెం వుడా కాలనీ వద్ద మెగా రక్తదాన శిబిరం జరగనుంది. 60వ వార్డు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యుడు పీవీ సురేష్ ఆధ్వర్యంలో పీవీఎస్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఈ శిబిరం నిర్వహిస్తున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, స్మార్ట్ సిటీ మాజీ చైర్మన్ జీవీ, స్టాండింగ్ కమిటీ సభ్యుడు పీవీ సురేష్ ఈ పోస్టర్‌ను విడుదల చేశారు. ఎంపీ కార్యాలయం వద్ద శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీకి చెందిన పలువురు నాయకులు పాల్గొన్నారు.

ధ్యానంతో చక్కటి ఆరోగ్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ భాగ్యగౌరీ

మల్కాపురం : శ్రీహరిపురం వద్ద గల శ్రీకృష్ణుని ఆలయంలో ధ్యానంపై ఉచిత శిక్షణ కార్యక్రమం శుక్రవారం జరిగింది. బ్రహ్మర్షి పితామహ పత్రీజీ ఆశీస్సులతో పిరమిడ్ సొసైటీ సహకారంతో జరిగిన కార్యక్రమంలో డాక్టర్ భాగ్యగౌరీ, పిరమిడ్ సొసైటీ సభ్యులు శివనాగేశ్వరరావు, రేవతీదేవి తదితరులు మాట్లాడుతూ ధ్యానం ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పొందొచ్చన్నారు. ధ్యానంతో మనసుకు ప్రశాంతత, పరుల పట్ల ప్రేమ, గౌరవంగా నడుచుకునే విధానాలు అలవడతాయన్నారు. నిత్యం ప్రతి ఒక్కరు 30 నిమిషాల పాటు ధ్యానం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు రాజేష్, అప్పలరాజు, గోపాల్, సన్యాసిరావు, శ్రీనివాసరావు, బాపారావు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

22న ఉత్తర్‌ప్రదేశ్ ఆవిర్భావ దినోత్సవం



గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ తదితరులు

మల్కాపురం: ఈ నెల 22న 60వ వార్డు పరిధి గుల్లలపాలెం వాకింగ్ పార్కు వద్ద ఉత్తరప్రదేశ్ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం నిర్వహించనున్నట్లు ఎంపీ జీవీఎల్ నరసింహారావు తెలిపారు. కార్యక్రమ పోస్టర్‌ను పార్కు వద్ద ఆయన ఆవిష్కరించారు. ఎంపీ మాట్లాడుతూ ఉత్తర్‌ప్రదేశ్ నుంచి రాజ్యసభకుప్రాతినిధ్యం వహిస్తున్నందున ఈ వేడుక నిర్వహిస్తున్నామన్నారు. ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ అన్న ప్రధాని నరేంద్ర మోదీ నినాదంలో భాగంగా ఒకరినొకరు గౌరవించుకోవాలనే ఉద్దేశంతో ఈ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీజేపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి దాడి రమేష్, గాజువాక సమన్వయకర్త కరణం రెడ్డి నర్సింగరావు, జిల్లా ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యం, పార్టీ ములగాడ మండల అధ్యక్షుడు ఎల్. రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత నగరంగా విశాఖ



పాత కరాసా గెడ్డను పరిశీలిస్తున్న కమిషనర్ రాజాబాబు, డిప్యూటీ మేయర్ జియ్యాని



మర్రిపాలెం రైతు బజార్‌లో వినియోగదారులతో మాట్లాడుతున్న కమిషనర్ రాజాబాబు, డిప్యూటీ మేయర్ శ్రీధర్

- నిషేధిత ప్లాస్టిక్ సంచులు విక్రయించినా, వినియోగించినా జరిమానా
- జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు
- 52వ వార్డులో డిప్యూటీ మేయర్‌తో కలిసి పర్యటన
- త్వరలోనే టిడ్కో ఇళ్లు అందిస్తామని వెల్లడి

గోపాలపట్నం: విశాఖను ప్లాస్టిక్‌రహిత నగరంగా మారుద్దామని జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు అన్నారు. శుక్రవారం 52వ వార్డులో ఆయన డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌తో కలిసి పర్యటించారు. పాత కరాసా రజకుల కాలనీ వద్ద ఉన్న గెడ్డ ఆధునికీకరణ, రిటైనింగ్ వాల్ ఏర్పాటు, రోడ్ల మరమ్మతులు, కాల్వలు, పార్కుల్లో వాకింగ్ ట్రాక్‌ల నిర్మాణం, స్థానికంగా ఉన్న జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల అభివృద్ధిపై అధికారులతో చర్చించారు. గౌరీనగర్‌లో టిడ్కో ఇళ్లు పూర్తయి నిరుపయోగంగా ఉన్నాయని.. వాటిని లబ్ధిదారులకు అందివ్వాలని స్థానికులు కోరగా దీనికి స్పందించిన కమిషనర్ వారం పది రోజుల్లో రైల్వే సమస్యను పరిష్కరించి ఇళ్లు అందిస్తామని హామీ ఇచ్చారు. టిడ్కో ఇళ్ల నుంచి వచ్చే మురుగు నీరు ప్రవహించేందుకు కాల్వలు ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

రైతు బజార్ సందర్శన

మర్రిపాలెం వుడా లేఅవుట్‌లో ఉన్న రైతు బజార్‌ను కమిషనర్ రాజాబాబు, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ సందర్శించారు. అక్కడ ప్లాస్టిక్ సంచుల వాడకంపై ఆరా తీశారు. వినియోగదారులతో మాట్లాడారు. ప్లాస్టిక్ సంచులు వాడరాదని, వాటి వల్ల పర్యావరణానికి హాని జరుగుతుందని వివరించారు. నిషేధిత ప్లాస్టిక్ సంచులు అమ్మినా, వినియోగదారులు వాడినా జరిమానా విధిస్తామని హెచ్చరించారు. విశాఖ నగరాన్ని ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చి దిద్దేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. నగరంలో నిషేధిత ప్లాస్టిక్ సంచులు కనించరాదని తెలిపారు. ప్రతిరోజు దీనిపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తామని తెలిపారు. ప్లాస్టిక్ సంచులకు బదులు గుడ్డ సంచులు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఎంవో శాస్త్రి, డీఈ ఏడుకొండలు, ఏఈ ఉష, వాటర్ వర్క్స్ ఏఈ గణేష్, సచివాలయ కార్యదర్శులు, వైఎస్సార్ సీపీ నగర కార్యదర్శి వెదుళ్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆడారి ఆనంద్ జన్మదిన వేడుకలు



పార్టీ కార్యాలయంలో కేక్ తినిపిస్తున్న డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ పుట్టిన రోజు వేడుకలను శుక్రవారం పలు వార్డుల్లో నిర్వహించారు. డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ ఆధ్వర్యంలో 52వ వార్డులోని పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. వ్యవసాయ, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ కృష్ణ, జియ్యాని మారుతి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. గోపాలపట్నంలో బెహరా భాస్కరరావు ఇంటి వద్ద 91, 92 వార్డు నాయకులు, కార్యకర్తల సమక్షంలో భాస్కరరావు కేక్ కట్ చేశారు. 58వ వార్డులోని పార్టీ కార్యాలయంలో కార్పొరేటర్ గులిగిందల లావణ్య కేక్ కట్ చేశారు. 89వ వార్డు కార్యాలయంలో వార్డు అధ్యక్షుడు దొడ్డి కిరణ్ పేదలకు, మహిళలకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు. 90వ వార్డు అధ్యక్షుడు చుక్క ప్రసాదరెడ్డి ఆధ్వర్యంలో పెందుర్తి లయోలా ఓల్డేజ్ హోమ్‌లో అన్నదానం నిర్వహించారు.

నెట్‌బాల్ టోర్నీలో 'బుల్లయ్య' విద్యార్థుల సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న బుల్లయ్య కళాశాల కరస్పాండెంట్ మధుకుమార్

సీతంపేట: ఏవీఎన్ కాలేజీలో ముగిసిన ఆంధ్రా యూనివర్సిటీ అంతర కళాశాలల పురుషుల నెట్ బాల్ టోర్నమెంట్‌లో లంకపల్లి బుల్లయ్య కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ చూపి ద్వితీయ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా శుక్రవారం వారిని బుల్లయ్య కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ అభినందించి క్రీడల్లో మరింతగా రాణించాలని ఆకాంక్షించారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.ఎస్.కె.చక్రవర్తి, వైస్ ప్రిన్సిపాల్ ఆర్.శ్రీకాంత్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.సోమేశ్వరరెడ్డి, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డి.దీపక్ చౌదరి, వ్యాయామ విభాగాధిపతి వై.శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్ లక్ష్మణరెడ్డి విద్యార్థులను అభినందించారు.

30, 31 తేదీల్లో బ్యాంకు ఉద్యోగుల దేశవ్యాప్త సమ్మె



ఎల్ఐసీ సెంట్రల్ బ్యాంకు వద్ద నిరసన చేస్తున్న బ్యాంకు ఉద్యోగులు

దాబాగార్డెన్స్ : యునైటెడ్ ఫోరమ్ బ్యాంక్ యూనియన్ పిలుపు మేరకు శుక్రవారం బ్యాంక్ ఉద్యోగులు నిరసన చేపట్టారు. జిల్లా బ్యాంక్ ఉద్యోగుల సమన్వయ సంఘం ఆధ్వర్యంలో ఎల్ఐసీ బిల్డింగ్ సెంట్రల్ బ్యాంక్ వద్ద కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సమన్వయ సంఘం ప్రతినిధులు ఆర్‌వీ రవికుమార్, వి. కమలాకర్, వి. రమేష్ మాట్లాడుతూ వారానికి ఐదు రోజుల పనిదినాలు అమలు చేయాలని, కొన్ని సవరణలతో పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని, కొత్త పెన్షన్ విధానం రద్దు చేయాలన్నారు. 12వ ద్వైపాక్షిక వేతన సవరణ ఒప్పందం అమలుకు చర్యలు చేపట్టాలన్నారు. 11వ వేతన సవరణలో అమలు కాకుండా ఉన్న న్యాయమైన డిమాండ్ల పట్ల సానుకూలంగా ప్రభుత్వం స్పందించకపోవడం వల్ల గత్యంతరం లేని పరిస్థితుల్లో ఈ నెల 30, 31 తేదీల్లో దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటున్నట్టు తెలిపారు. పి. ఈశ్వరరావు, టి. రాజు, బి. రామారెడ్డి, జి. సూర్యలక్ష్మి, ఎస్. అనూషభాను, కెఎస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

రేపు మరిడిమాంబ పరస



మల్కాపురం : మల్కాపురం గ్రామ దేవత మరిడిమాంబ అమ్మ వారి (కాకి అప్పన్న) పరస ఆదివారం జరగనుందని నిర్వాహకుడు కాకి పోలిరెడ్డి శుక్రవారం తెలిపారు. గత 50 ఏళ్ల నుండి మల్కాపురంలో తమ పూర్వీకుల నాటి నుండి పరస నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరస సందర్భంగా ఆదివారం తెల్లవారి నుండి మరిడిమాంబ అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. అలాగే వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ ఉంటుందన్నారు. పరసకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

రైళ్ల పరిశుభ్రతకు సహకరించండి

ప్రయాణికులకు డీఆర్ఎం విజ్ఞప్తి



డీఆర్ఎం అనూప్ కుమార్ సత్పతి

తాటిచెట్లపాలెం: రైళ్లను పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రయాణికులు సహకరించాలని, ఇది అందరి బాధ్యతని డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి అన్నారు. సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నం చేరుకున్న వందే భారత్ రైలు ను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఎప్పటికప్పుడు హౌస్‌కీపింగ్ సిబ్బంది రైలును శుభ్రం చేస్తున్నా కూడా విశాఖకు చేరేసరికి పలు కోచ్‌ల నిండా ప్లాస్టిక్ బాటిల్స్, పేపర్ కప్స్, వ్యర్థాలు ఎక్కడపడితే అక్కడ పారేసి ఉన్నాయని చెప్పారు. పరిస్థితిని చూసిన డీఆర్ఎం స్పందిస్తూ డోంట్ బీ బిట్టర్–స్టాప్ ద లిట్టర్ అని ప్రయాణికులకు విజ్ఞప్తి చేశారు. ప్రతిష్ఠాత్మక వందేభారత్ రైలు శుభ్రంగా ఉంచాలని, దీనికోసం డస్ట్‌బిన్లను ఏర్పాటు చేశారని తెలిపారు.

ప్రజా గర్జనతో కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం

- ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు
- నిర్వాసిత కాలనీల్లో మహా పాదయాత్ర



పాదయాత్రలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి

పెదగంట్యాడ: విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు అనే నినాదంతో స్టీల్‌ప్లాంట్‌ను సాధించుకున్నామని, దానిని ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేటుపరం కానివ్వబోమని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు స్పష్టం చేశారు. ఈ నెల 30న నిర్వహించనున్న ప్రజా గర్జనతో కేంద్ర ప్రభుత్వం కళ్లు తెరిపిస్తామన్నారు. ఐఎన్‌టీయూసీ ఆర్గనైజింగ్ ప్రెసిడెంట్ గొందేశి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వాసిత కాలనీల్లో శుక్రవారం మహా పాదయాత్ర చేపట్టారు. నడుపూరులోని అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రారంభమైన యాత్ర ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ ఉక్కునగరంలోని తృష్ణ మైదానంలో నిర్వహించనున్న ప్రజా గర్జనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు, నిర్వాసితులు, ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. అన్ని రాజకీయ పార్టీల నాయకులను ఒకే వేదిక మీదకు తీసుకువచ్చి ఉక్కు ప్రైవేటీకరణను అడ్డుకుంటామన్నారు. ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ మాట్లాడుతూ 708 రోజులుగా ఉద్యమాలు చేస్తున్నా కేంద్ర ప్రభుత్వంలో చలనం లేకపోవడం దారుణమన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించే వరకు ఉద్యమం కొనసాగుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి మాట్లాడుతూ 32 మంది ప్రాణ త్యాగాలతో నిర్మించుకున్న స్టీల్‌ప్లాంట్‌ను ఎలా ప్రైవేటుపరం చేస్తారని ప్రశ్నించారు. విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. నాయకులు, కార్మికులు, నిర్వాసితులు పెదగంట్యాడ జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. నినాదాలతో హోరెత్తించారు. కార్యక్రమంలో 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, అనిపెద్ది మసేనురావు, నమ్మి రమణ, బొడ్డు పైడిరాజు, డి.వి. రమణ, పులి వెంకటరమణారెడ్డి, గొందేశి సత్యారావు, గొందేశి వెంకటరమణారెడ్డి, మహేశ్వరరెడ్డి, మార్టుపూడి పరదేశి, జగదీష్, నక్క రమణ, దొమ్మేటి అప్పారావు, నీరుకొండ రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి మాఘ మాసోత్సవాలు



ఉషా ఛాయా సమేత శ్రీ సూర్యనారాయణ స్వామి

అల్లిపురం: వెంకటేశ్వరమెట్టపై వెలసిన శ్రీ సూర్యనారాయణమూర్తి దేవాలయంలో జనవరి 22వ తేదీ నుంచి మాఘ మాసోత్సవాలు ప్రారంభమవుతాయని అలమేలు మంగమ్మ అమ్మవారి దేవాలయం అర్చకులు పాణంగిపల్లి కేశవాచార్యులు తెలిపారు. ఈ ఏడాది 22, 29, 5, 12, 19 తేదీల్లో ఐదు మాఘ ఆదివారాలు వచ్చాయని పేర్కొన్నారు. 1వ తేదీన భీష్మ ఏకాదశి సందర్భంగా ప్రత్యేక పూజలు చేపట్టనున్నట్లు తెలిపారు. అదే రోజు సాయంత్రం శ్రీ భూ సమేత శ్రీనివాస కల్యాణం నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. 5వ తేదీన మాఘ పౌర్ణమి, మూడో ఆదివారం కావటం విశేషమన్నారు. 22వ తేదీ తెల్లవారు జామున 5 గంటల నుంచి ఛాయా ఉషాదేవి సమేత సూర్యనారాయణస్వామి వారికి విశేష పంచామృతాభిషేకాలు చేపట్టిన అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించనున్నట్లు తెలిపారు.

పూడికలు తొలగించారు



గణేష్‌నగర్ గెడ్డలో పూడికలు తొలగిస్తున్న సిబ్బంది



పూడికలు తొలగించిన అనంతరం బాగు పడిన గెడ్డ

సాక్షి ఎఫెక్ట్..

గోపాలపట్నం: పూడికలతో నిండిపోయిన గణేష్‌నగర్ గెడ్డలో పూడికలు తొలగించారు. దీనిపై ఈ నెల 18న సాక్షిలో 'గణేష్‌నగర్ గెడ్డ అపారిశుధ్యానికి అడ్డా'అనే శీర్షికతో వార్త ప్రచురితం కావడంతో 52వ వార్డు పారిశుధ్య అధికారులు స్పందించారు. శుక్రవారం ఉదయం ప్రత్యేకంగా పొక్‌లైనర్‌తో తొలగించారు. దీంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. పూడికలతో నిండిపోయి.. పురుగులు పట్టి ఉన్న పూడిక తొలగింపుతో సమస్య తీరిందని సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.


కుళాయి కనెక్షన్ల తొలగింపు



క్రాంతినగర్‌లో కుళాయి కనెక్షన్లు తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది

సింధియా : క్రాంతినగర్ సచివాలయం పరిధిలో ఉన్న ఇంటిపన్ను చెల్లించని వారి ఇళ్ల కుళాయి కనెక్షన్లను శుక్రవారం సచివాలయ సిబ్బంది సంబంధిత మంచినీటి విభాగం సిబ్బందితో కలిసి తొలగించారు. ఈ సందర్భంగా సచివాలయ అడ్మిన్ మహమ్మద్ షఫీ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ఇంటి పన్ను బకాయిలను చెల్లించమని ఇదివరకే నోటీసుల ద్వారా సమాచారం ఇచ్చినా చెల్లించకపోవడంతో అధికారుల ఆదేశాల మేరకు ఏడు మంచినీటి కుళాయి కనెక్షన్లు తొలగించామని తెలిపారు. అయినా వారు స్పందించకపోతే వారికి అందుతున్న ప్రభుత్వ సేవలను నిలిపివేస్తామన్నారు. యూజర్ చార్జీలు, ఇంటి పన్నులను సకాలంలో చెల్లించి తద్వారా ప్రజాభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఈవో శిరీష తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఈవోతో పాటు, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వరంగ సంస్థల వల్లే ఆర్థిక ప్రగతి



కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న రామారావు

కూర్మన్నపాలెం: ప్రభుత్వ రంగ సంస్థల వల్లే దేశంలోని ఆర్థిక వ్యవస్థ పురోగతి సాధిస్తోందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. అటువంటి సంస్థలను కార్పొరేట్లకు అప్పగించడం సరికాదన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 708వ రోజు, శుక్రవారం సీఎంఎం, సీఆర్ఎంపీ, సీఈడీ కార్మికులు పాల్గొన్నారు. దీక్ష శిబిరంలో పాల్గొన్న ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకుడు ఎస్. రామారావు మాట్లాడుతూ త్యాగాలు, పోరాటాల ద్వారా సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రైవేట్‌పరం చేస్తే సహించేది లేదన్నారు. దళితులు, బలహీన వర్గాలు, పేదల సంక్షేమాన్ని విస్మరించి కేంద్ర ప్రభుత్వం బడా పారిశ్రామికవేత్తలకు దేశ సంపదను దోచిపెడుతోందని ఆరోపించారు. ఇది అత్యంత దుర్మార్గమైన చర్య అన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను, రాయితీలను సమసమాజ స్థాపనకు ఉపయోగపడే విధంగా చేస్తామని ప్రమాణం చేసిన కేంద్ర ప్రభుత్వం నేడు కార్మికుల హక్కులను పూర్తిగా కాలరాయడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. బీజేపీ మినహా అన్ని రాజకీయ పార్టీలు స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంఘీభావం తెలిపాయన్నారు. ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయానికి కేంద్ర ప్రభుత్వం స్వస్తి పలికే వరకు వినూత్న రీతిలో నిరసన తెలియజేస్తూనే ఉంటామన్నారు. శిబిరంలో వివిధ విభాగాల ప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు.

బురద జల్లితే సహించం

మహారాణిపేట : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘంపైన ఏపీఎన్‌జీవో సంఘం నాయకులు బురద జల్లుడు కార్యక్రమం ఆపకపోతే తాము అంతే స్థాయిలో స్పందించవలసి వస్తుందని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి పీజే జవహర్, జిల్లా అధ్యక్షుడు ఎస్‌వీ రమణ, కార్యదర్శి బీవీఎస్ రవిశంకర్ హెచ్చరించారు. ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఉద్యోగుల సంక్షేమం కోసం పోరాటం చేస్తామని జవహర్ శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. ఏపీ ఎన్‌జీవో సంఘం నాయకులు వారికి ప్రభుత్వం కేటాయించిన భవనాలను వ్యాపార కేంద్రాలుగా మార్చి లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వానికి జమా ఖర్చులు కూడా చూపించడం లేదని అన్నారు. ఈ విషయం అడిగినందుకు తమపై ఎదురు దాడి చేస్తున్నారని అన్నారు.

అభివృద్ధే బీజేపీని గెలిపిస్తుంది

దొండపర్తి : దేశాభివృద్ధికి ప్రధాన మంత్రి మోదీ చేపడుతున్న చర్యలే ఎన్నికల్లో తమ పార్టీని గెలిపిస్తాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు పేర్కొన్నారు. బీజేపీ వైద్య విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం మహారాణిపేటలో ఉన్న ప్రకృతి చికిత్సాలయం ఆవరణలో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఓటర్లతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సోము వీర్రాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వాలకు బియ్యం, కందిపప్పు నిత్యావసర సరకులపై కేంద్ర ప్రభుత్వం అధిక శాతం సబ్సిడీ ఇస్తోందని తెలిపారు. ప్రభుత్వం ప్రజలకు నాణ్యమైన బియ్యం అందించాలని డిమాండ్ చేశారు. దీనిపై బీజేపీ రానున్న రోజుల్లో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎమ్మెల్సీ మాధవ్, రాష్ట్ర యువమోర్చా అధ్యక్షుడు కేతినేని సురేంద్ర, పార్టీ నగర అధ్యక్షుడు ఎం.రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా పరిహారం అందజేత

మర్రిపాలెం: వైఎస్సార్ బీమా పథకం ద్వారా వచ్చిన లక్ష రూపాయల పరిహారాన్ని మృతుడి కుటుంబానికి కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ అందజేశారు. 51వ వార్డు ఏకలవ్య కాలనీలో నివాసముంటున్న అప్పన్న అనే వ్యక్తి మరణించడంతో అతడి కుటుంబానికి వైఎస్సార్ బీమా ఆసరాగా నిలిచింది. మృతుడి భార్య సుశీలకు శుక్రవారం వార్డు కార్యాలయంలో కార్పొరేటర్ వెంకటరమణ బీమా చెక్కు అందజేశారు. వలంటీర్ రోషిణి తదితరులు పాల్గొన్నారు.